RNI NO.TELTEL/2023/87655

# దీక్ష ప్రభ

తెలుగు దినపత్రిక

15-02-2026

ఆదివారం, హైదరాబాద్

సంపుటి: 03 । సంచిక: 320

పేజీలు: 04 । వెల: 5/-

ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:

https://epaper.deekshaprabhadaily.com



లాయర్ స్వప్న హత్య కేసులో మరో ట్విస్ట్ 2



## మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే

# ఆదర్శంగా తీర్చిదిద్దాలి

### రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించాం

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలి
- సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించిన సీఎం రేవంత్

2

మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు.



# సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఏపీ వార్షిక బడ్జెట్

- రూ. 3.32 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి
- వ్యవసాయం, మున్సిపల్, పోలీస్ శాఖలకు భారీగా కేటాయింపులు
- విద్యారంగానికి పెద్దపీట వేసిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్


**ఏపీ బ్యూరో, దీక్షప్రభ:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర అసెంబ్లీలో 202627 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,32,205 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అన్ని వర్గాల ప్రజల అవసరాలను, రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఈ బడ్జెట్‌ను రూపకల్పన చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ వార్షిక బడ్జెట్‌లో సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు.

**వ్యవసాయ రంగానికి భారీ కేటాయింపులు..**

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ వ్యవసాయ రంగానికి మొత్తంగా రూ.11,745 కోట్లను కేటాయించింది. ఇందులో పంట బీమా పథకం కోసం రూ.250 కోట్లు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి కృషి సంచాయ్ యోజన' పథకానికి రూ.190 కోట్లు కేటాయించారు. మిగతా2లో...

## రాజకీయ విరాళాల్లో బీజేపీ రికార్డు

- ఎలక్టోరల్ ట్రస్ట్‌ల ద్వారా అందిన నిధుల్లో 82.5% బీజేపీకే
- కాంగ్రెస్‌కు దక్కింది కేవలం 7.8 శాతం మాత్రమే
- కార్పొరేట్ దిగ్గజాల భారీ విరాళాలు




**నేషనల్ బ్యూరో, దీక్షప్రభ:** దేశీయ రాజకీయ పార్టీలకు అందిన విరాళాల్లో భారతీయ జనతా పార్టీ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ తాజాగా విడుదల చేసిన 2024-25 ఆర్థిక సంవత్సర నివేదిక ప్రకారం.. మిగతా2లో...

## కొత్తగూడెంపై కుదిరిన దోస్తీ

- మేయర్ పీఠం చెరి రెండున్నరేళ్లు
- డిప్యూటీ మేయర్ పదవి సైతం 50-50
- మొదటిసారి సీపీఐకి అవకాశం
- కాంగ్రెస్, సీపీఐ మధ్య కుదిరిన అవగాహన
- సీఎం రేవంత్ రెడ్డితో చర్చల అనంతరం ఫైనల్
- చక్రం తిప్పిన టీపీసీసీ చీఫ్, పొంగులేటి

2

## డిజిటల్ అరెస్ట్ పేరుతో
# నయా మోసాలు

### ప్రజలను హెచ్చరించిన సీపీ సజ్జనార్


- చట్టాల్లో 'డిజిటల్ అరెస్ట్'కు చట్టబద్ధత లేదని స్పష్టీకరణ
- వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని పిలుపు



**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో అమాయకులను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో సాగుతున్న నయా మోసాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. శనివారం ఆయన తన 'ఎక్స్' ఖాతా ద్వారా ఒక వీడియోను షేర్ చేస్తూ, పోలీస్ వేషధారణలో వచ్చే వీడియో కాల్స్ నమ్మవద్దని సూచించారు.

**పోలీస్ వేషంలో పక్కా మోసం**

నేరగాళ్లు పోలీస్ స్టేషన్ తరహా సెటప్ ఏర్పాటు చేసుకుని, పోలీసు యూనిఫాం ధరించి వీడియో కాల్స్ చేస్తున్నారని సీపీ తెలిపారు. అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, మిగతా2లో...



## కేంద్రం సంచలన నిర్ణయం?

- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకం చుట్టూ రాజకీయ దుమారం
- 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' ప్రచురణపై వివాదం
- 20 ఏళ్ల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'విధించే యోచన
- ఎప్ స్టిన్ ఫైల్స్ అంశంపైనా కేబినెట్ చర్చ

2



## దేశీ కుక్క పిల్లలను దత్తత తీసుకోండి

- నగర ప్రజలకు మంత్రుల పిలుపు
- షాపింగ్ వద్దు, దత్తత ముద్దు
- కేబీఆర్ పార్కులో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పప్పీల దత్తత మేళా
- ప్రారంభించిన మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీ రేణుకా చౌదరి

2

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు.. కన్నదీ విన్నదీ నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..వారి సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలకు దిక్సూచిగా మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..!!

దీక్ష ప్రభ
తెలుగు దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను

మీకో చక్కని వేదికగా నిలుస్తోంది. ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.

సంప్రదించండి

95500 21491



# సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఏపీ వార్షిక బడ్జెట్



(మొదటి పేజీ తరువాయి)
దీనివల్ల రైతులకు ఆర్థిక భరోసా కలుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**బలోపేతం కానున్న మున్సిపాలిటీలు..**
రాష్ట్రంలోని మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా మున్సిపల్ శాఖకు రూ.14,339 కోట్లను బడ్జెట్ లో కేటాయించారు. ఈ నిధుల ద్వారా పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా వంటి పనులను వేగవంతం చేయనున్నారు.

**పోలీస్ శాఖ ఆధునీకరణ..**
శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు ప్రభుత్వం భారీగా నిధులు ప్రకటించింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పోలీసు శాఖ వాహనాల కొనుగోలు కోసం రూ. 3,000 కోట్లను త్వరలోనే విడుదల చేయనున్నట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అంతేకాకుండా, రాష్ట్రంలో అత్యాధునిక పోలీస్ అకాడమీని ఏర్పాటు చేయడానికి 94 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

**విద్యారంగానికి నిధుల వర్షం..**
విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర స్కాలర్‌షిప్‌ల కోసం రూ.3,836 కోట్లను బడ్జెట్ లో కేటాయించారు. దీనితో పాటు 'తల్లికి వందనం' పథకానికి రూ.9,668 కోట్లు, పాఠశాల విద్యాశాఖకు రూ.32,308 కోట్లు, ఉన్నత విద్యాశాఖకు రూ.2,567 కోట్లు కేటాయిస్తూ విద్యారంగానికి పెద్దపీట వేశారు.

# మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**హైదరాబాద్,దీక్షప్రభ:** మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. మంచి ఫలితాలు సాధించారని మంత్రులు, సీనియర్ నేతలను అభినందించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నమ్మకాన్ని కల్పించామన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత ముందుకెళ్లాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు.

**రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి భేటీ**
సీఎం రేవంత్‌రెడ్డితో సీపీఐ నేత పల్లా వెంకట్‌రెడ్డి సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, తాజా పరిణామాలు, కొత్తగూడెం కార్పొరేషన్ గురించి చర్చించారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో కాంగ్రెస్ కూటమి (కాంగ్రెస్22, సీపీఎం1) 23 డివిజన్లలో విజయం సాధించింది. సీపీఐకి 22, బీఆర్ఎస్8, భాజపా 1, స్వతంత్రులు 6 డివిజన్లలో గెలుపొందారు. స్వతంత్రుల్లో ఒకరు సీపీఐ నాయకుడు కావటంతో ఆ పార్టీ బలం కూడా 23కు చేరింది. మిగిలిన ఐదుగురు స్వతంత్రుల్లో ముగ్గురు, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారిలో ముగ్గురు హస్తం గూటికి చేరటంతో కాంగ్రెస్ కూటమి బలం 29కు పెరిగింది. మేయర్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్, సీపీఐ కలిసి నడుస్తాయా.. లేదా విడివిడిగా ప్రయత్నిస్తాయా అనే అంశంపై ఆసక్తి



# కొత్తగూడెంపై కుదిరిన దోస్తీ

- మేయర్ పీఠం చెరి రెండున్నరేళ్లు
- డిప్యూటీ మేయర్ పదవి సైతం 50-50
- మొదటిసారి సీపీఐకి అవకాశం
- కాంగ్రెస్, సీపీఐ మధ్య కుదిరిన అవగాహన
- సీఎం రేవంత్ రెడ్డితో చర్చల అనంతరం ఫైనల్
- చక్రం తిప్పిన టీపీసీసీ చీఫ్, పొంగులేటి




**ఖమ్మం,దీక్షప్రభ:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యంతో కొత్తగూడెం కార్పొరేషన్ వ్యవహారంలో ఉత్కంఠకు తెర పడింది. మేయర్ పీఠాన్ని చెరో రెండున్నరేళ్లు పంచుకునేందుకు సీపీఎం, కాంగ్రెస్ నిర్ణయించాయి. ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా మొదట సీపీఎంకు మేయర్ పీఠం దక్కనుంది. సీపీఎం నేతలతో చర్చల అనంతరం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. త్వరలోనే ఇరు పార్టీల నేతలు మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్ పేర్లను అధికారికంగా ప్రకటించనున్నారు. కాగా, సీపీఐతో పొత్తు పెట్టుకుంటామని కేటీఆర్ ఆఫర్ ఇచ్చినా.. సీఎం రేవంత్ రెడ్డి జోక్యంతో సీన్ రివర్స్ అయ్యింది.

**గంట గంటకూ ఉత్కంఠ..**
అంతకుముందు శనివారం రాత్రి వరకు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠంపై గంట గంటకూ సమీకరణలు మారాయి. సీపీఐతో కలసి వస్తారనుకున్న ఇండిపెండెంట్లు కాంగ్రెస్ వైపు మారినట్లు చర్చ జరిగింది. అయితే 51వ డివిజన్ నుంచి ఇండిపెండెంట్‌గా గెలిచిన కార్పొరేటర్ దుర్గా ప్రసాద్ మాత్రం సీపీఐతో ఉండడం వల్ల, ఎక్స్ అఫీషియో మెంబర్‌తో కలిపి ఆ పార్టీకి 24 సీట్లు ఉన్నాయి. మ్యాజిక్ ఫిగర్ చేరాలంటే ఇంకా ఏడుగురి మద్దతు కావాలి. బీఆర్ఎస్‌కు 8 మంది ఉన్నారు కాబట్టి, కాంగ్రెస్ మద్దతు లేకపోయినా సీపీఐకి మేయర్ పీఠం దక్కే అవకాశాలు కనిపించాయి.

**చక్రం తిప్పిన టీపీసీసీ చీఫ్, పొంగులేటి**
మరో పక్క కాంగ్రెస్‌తో ఐదుగురు ఇండిపెండెంట్లు టచ్‌లో ఉన్నారనుకున్నా.. ఎక్స్ అఫీషియో, సీపీఎంతో కలిపి ఆ పార్టీకి 29 సీట్లు అవుతున్నాయి. అయినా, ఇంకా ముగ్గురు కార్పొరేటర్ల మద్దతు అవసరం. అదే సమయంలో బీఆర్ఎస్‌లోని ముగ్గురు కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సీపీఐ రాష్ట్ర కమిటీ జూమ్ మీటింగ్ జరిగింది. సమావేశంలో ఏం నిర్ణయం తీసుకున్నారనేది బయటకు రాలేదు. కానీ, ఆ పార్టీ తమ కార్పొరేటర్లను రహస్య ప్రదేశానికి తరలించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. హంగ్ ఉన్న కార్పొరేషన్లకు సంబంధించి నిర్ణయం తీసుకోవడానికి మంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలోనే కొత్తగూడెం కార్పొరేషన్‌పై చర్చించారు. అనంతరం సీపీఐ నేత పల్లా వెంకట రెడ్డితో సీఎం చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. తర్వాత మిగిలిన పనిని టీపీసీసీ చీఫ్, మంత్రి పొంగులేటి పూర్తి చేశారు.

# లాయర్ స్వప్న హత్య కేసులో మరో ట్విస్ట్



- సోదరుడి కుట్రలో మరో ఇద్దరు భాగస్వామ్యం
- కారు, బుల్డోజర్‌తో గతంలోనూ హత్యాయత్నం చేసినట్లు వెల్లడి
- రోడ్డు ప్రమాద కేసులు హత్యాయత్నం కేసులుగా మార్పు
- ఈ కేసులో మరో ఇద్దరు నిందితుల అరెస్ట్

**తెలంగాణ బ్యూరో,దీక్షప్రభ:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లిలో లాయర్ స్వప్న(34) దారుణ హత్య కేసు దర్యాప్తులో పోలీసులు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్తి వివాదాల నేపథ్యంలో తన సొంత చెల్లెలిని చంపేందుకు అన్న రాజు పన్నిన ప్లాన్ ఒక్కొక్కటిగా బయటపడుతోంది. ఈ కేసులో ఇప్పటికే ప్రధాన నిందితుడు రాజుతో పాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు, తాజాగా మరో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్వప్న కదలికలను ఎప్పటికప్పుడు రాజుకు చేరవేసిన శేఖర్ అనే వ్యక్తిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

**గతంలోనూ రెండుసార్లు హత్యాయత్నం..**
విచారణలో షాకింగ్ నిజాలు ఒప్పుకున్న రాజు, హత్యకు ముందు స్వప్నను చంపేందుకు రెండుసార్లు ప్రయత్నించినట్లు తెలిపాడు. మొదటిసారి కారుతో స్వప్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి హత్య చేసేందుకు ప్లాన్ చేశాడు. రెండోసారి బుల్డోజర్‌తో స్వప్నను ఢీకొట్టించి, ఆ ప్రమాదంలో ఆమె మరణిస్తే రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని భావించాడు. అయితే, స్వప్న అదృష్టవశాత్తూ ఆ రెండు ప్రమాదాల నుండి ప్రాణాలతో బయటపడింది.

**సీసీ కెమెరాలు లేని ప్రదేశాల కోసమే వేట..**
సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను ముందే గుర్తించిన రాజు, ఆ ప్రదేశాల్లో స్వప్నను వాహనాలతో వెనుక నుండి ఢీకొట్టాలని ప్లాన్ చేశాడు. ఈ ప్లాన్ సక్సెస్ చేయడం కోసం తన స్నేహితులు వీరేష్, శివ, శేఖర్ సహాయం తీసుకున్నాడు. గతంలో నమోదైన ఈ రోడ్డు ప్రమాద కేసులను ఇప్పుడు పోలీసులు హత్యాయత్నం కేసులుగా మార్చనున్నట్లు వెల్లడించారు.




# దేశీ కుక్క పిల్లలను దత్తత తీసుకోండి

**తెలంగాణ బ్యూరో,దీక్షప్రభ:** దేశీ కుక్క పిల్లలను దత్తత తీసుకునేందుకు నగర ప్రజలు ముందుకు రావాలని మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఎంపీ రేణుకా చౌదరి విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో శనివారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇండీ కుక్కపిల్లల దత్తత మేళా'ను వారు ప్రారంభించారు. "బీ ఏ హీరో.. దత్తత తీసుకోండి, షాపింగ్ వద్దు" అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మంత్రులు అభినందించారు. మేళాలో ప్రదర్శనకు ఉంచిన కుక్కపిల్లలను పరిశీలించిన మంత్రులు, దత్తత తీసుకున్న వారికి పప్పీలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అల, జీహెచ్ఎంసీ చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పూర్వకాలం నుండి కుక్కలు మనుషులకు నమ్మకమైన మిత్రులుగా ఉంటున్నాయని గుర్తుచేశారు. వీధుల్లో ఉండే కుక్క పిల్లలను ప్రజలు దత్తత తీసుకుని తమ ఇంట్లో చోటు కల్పించాలని కోరారు. దత్తత తీసుకున్న వారు పప్పీలను కుటుంబ సభ్యుల్లా, స్నేహితుల్లా ఆదరించాలని, యజమానులు వాటికి సకాలంలో వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేయించాలని సూచించారు.వాలెంటైన్స్ డే సందర్భంగా నిర్వహించిన ఈ మేళాలో డీవార్మింగ్, వ్యాక్సినేషన్ పూర్తి చేసుకున్న ఆరోగ్యకరమైన 50 దేశీ కుక్కపిల్లలను ప్రదర్శనకు ఉంచారు. ఇందులో 30 కుక్కపిల్లలను సందర్శకులు దత్తత తీసుకున్నారు. ఈ కార్యక్రమం మనుషులు, జంతువుల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధానికి ప్రతిరూపంగా నిలిచింది.

# 'డిజిటల్ అరెస్ట్' పేరుతో నయా మోసాలు


(మొదటి పేజీ తరువాయి)
డబ్బులు దండుకుంటున్నారని ఆయన వివరించారు. 'పోలీస్ వేషం చూసి మోసపోకు.. వీడియో కాల్ నమ్మి మునిగిపోకు' అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. పోలీసులు ఎప్పుడూ వాట్సాప్ లేదా స్కైప్ వంటి వీడియో కాల్స్ ద్వారా నిందితులను విచారించరని సీపీ సజ్జనార్ తెలిపారు. విచారణ పేరుతో పోలీసులు ఎవరినీ డబ్బులు డిమాండ్ చేయరని పేర్కొన్నారు. భారత చట్టాల్లో 'డిజిటల్ అరెస్ట్' అనే పదమే లేదు. దీనికి చట్టబద్ధత లేదని చెప్పారు.

**అప్రమత్తతే రక్ష**
నగర పోలీసులు చేపట్టిన 'జాగృత్ హైదరాబాద్ సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ కోరారు. ఇలాంటి బెదిరింపు కాల్స్ వస్తే ఆందోళన చెందవద్దని, వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమాచారాన్ని కుటుంబ సభ్యులు, మిత్రులకు షేర్ చేసి వారికి కూడా అవగాహన కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

# రాజకీయ విరాళాల్లో బీజేపీ రికార్డు


(మొదటి పేజీ తరువాయి)
ప్రకారం.. రాజకీయ పార్టీలకు ఎలక్టోరల్ ట్రస్ట్‌ల ద్వారా అందిన విరాళాల్లో సింహభాగం బీజేపీకే దక్కాయి. దేశవ్యాప్తంగా వివిధ సంస్థల నుంచి ఎలక్టోరల్ ట్రస్ట్‌లకు రూ.3,826 కోట్ల విరాళాలు అందాయి. ఈ మొత్తం నిధుల్లో, బీజేపీకి రూ.3,157 కోట్లు (సుమారు 82.5%) దక్కాయి. కాంగ్రెస్ పార్టీకి కేవలం రూ.298.78 కోట్లు (7.8%) మాత్రమే దక్కాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.102 కోట్లు అందాయి.

**ప్రధాన దాతలు - కార్పొరేట్ దిగ్గజాల వాటా**
రాజకీయ విరాళాల్లో కార్పొరేట్ సంస్థల వాటా అత్యధికంగా ఉంది. ఎలివేటెడ్ అవెన్యూ రియల్టీ రూ.500 కోట్లు అందజేసి అగ్రస్థానంలో నిలిచింది. టాటా గ్రూప్ (టాటా సన్స్ & TCS) సుమారు రూ.525 కోట్ల నిధులను సమకూర్చింది. మేఘా ఇంజనీరింగ్ తెలుగు రాష్ట్రాల నుండి రూ.175 కోట్లను విరాళంగా ఇచ్చి ప్రముఖ దాతల జాబితాలో నిలిచింది. ఈ భారీ నిధుల సమీకరణ బీజేపీకి పార్టీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసేందుకు, ఎన్నికల వ్యయానికి భారీ ఆర్థిక వెన్నుదన్నుగా నిలిచింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నిధుల సమీకరణలో కనిపిస్తున్న ఈ భారీ వ్యత్యాసం, భవిష్యత్తులో ఎన్నికల ప్రచారాలు, పోటీ తత్వాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# కేంద్రం సంచలన నిర్ణయం?

- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకం చుట్టూ రాజకీయ దుమారం
- 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' ప్రచురణపై వివాదం
- 20 ఏళ్ల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'విధించే యోచన
- ఎప్ స్టిన్ ఫైల్స్ అంశంపైనా కేబినెట్ చర్చ




**నేషనల్ బ్యూరో:** భారత సైన్యానికి నాయకత్వం వహించిన మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవణే రచించిన ఆత్మకథ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంకా అధికారికంగా విడుదల కాకముందే ఈ పుస్తకంలోని అంశాలు బయటకు రావడం, దానిపై పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరగడం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ముఖ్యంగా గల్వాన్ ఘర్షణలు, అగ్నివీర్ పథకం వంటి సున్నితమైన అంశాల గురించి ఇందులో ప్రస్తావించినట్లు సమాచారం.

**20 ఏళ్ల 'కూలింగ్ ఆఫ్ పీరియడ్' నిబంధన?**
ఈ వివాదం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఒక కఠినమైన నిర్ణయం తీసుకోబోతున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. మిలిటరీ సహా ఇతర కీలక ఉన్నత పదవుల్లో పనిచేసి రిటైర్ అయిన అధికారులు, వారు బాధ్యతల నుంచి తప్పుకున్న 20 ఏళ్ల వరకు పుస్తకాలు ప్రచురించకూడదనే 'కూలింగ్ ఆఫ్ పీరియడ్'ను తప్పనిసరి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇటీవల జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశంపై అనధికారికంగా చర్చ జరిగినట్లు సమాచారం. దేశ భద్రత, రహస్య సమాచార రక్షణ దృష్ట్యా ఈ నిబంధన అవసరమని పలువురు మంత్రులు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం, కీలక అధికారులు రాసే పుస్తకాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. నరవణే పుస్తకానికి రక్షణ శాఖ ఇంకా క్లియరెన్స్ ఇవ్వలేదు. ఈ లోపే పుస్తక ప్రతులు బయటకు రావడంపై ఢిల్లీ పోలీసులు ఇప్పటికే ఎఫ్ఆర్ఐ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఎప్ స్టిన్ ఫైల్స్ వివాదంపై ప్రభుత్వం స్పందన**
ఇదే సమావేశంలో ఇటీవల అమెరికాలో బయటపడిన జెఫ్రీ ఎప్ స్టిన్ ఫైల్స్ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేరు ఈ ఫైల్స్‌లో ఉందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను మంత్రి ఇప్పటికే ఖండించారు. ప్రతిపక్షాల విమర్శలపై అతిగా స్పందించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా కొనసాగించాలని మంత్రులు ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

## భక్తి మార్గంలో ఉంటేనే సకల సంతోషాలు కలుగుతాయి

**హరిభక్త పారాయణ్ చైతన్య మహారాజ్ వడాగావ్**



**పోతంగల్,దీక్ష ప్రభ:** ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడిచినప్పుడు వారికి సకల సంతోషాలు కలుగుతాయని హరి భక్త పారాయణ్ చైతన్య మహారాజ్ పేర్కొన్నారు. మనిషి భాగవతారాధన చేయడంవల్ల శత్రుబాధలు, రుణబాధలు ఉండవనీ ఎలాంటి కీడు జరగదని అన్నారు. పోతంగల్ మండలంలోని హంగర్గ బీసీ కాలనీ లోని హనుమాన్ మందిరంలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ ఘనంగా కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి శుక్రవారం సాయంత్రం ముఖ్య అతిథిగా శ్రీ చైతన్య మహారాజ్ హాజరయ్యారు.ఆయనకు గ్రామ సర్పంచ్ ఉదయ్ భాస్కర్, భజన బృందం, గ్రామ పెద్దలు, భక్తులతో కలసి ఘన స్వాగతం పలికారు. ఆలయంలో, సప్తాహ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన చైతన్య మహారాజ్ పూజల అనంతరం భక్తులనుద్దేశించి ప్రవచనం అందించారు.ఈ సందర్భంగా భక్తులు చైతన్య మహారాజ్ కు శాలువ పులమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా హరి భక్త పారాయణ్ చైతన్య మహారాజ్ మాట్లాడుతూ..దేశం ఎంత అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రతి ఒక్కరి మనశ్శాంతికి భక్తి మార్గమే ప్రధానమని అన్నారు. భక్తి మార్గంలో ఉన్న మనుషులకు సకల సంతోషాలు కలుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్ భాస్కర్, కంచం గంగాధర్ మహారాజ్, పుట్టి శంకర్, విఠల్ పటేల్, పుట్టి అశోక్, శివరాం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

**పివి రావు మాల మహానాడు కమిటీ**



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** నందికొట్కూరు పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా తొలుత దామోదరం సంజీవయ్య చిత్రపటానికిపి. వి. రావు మాల మహానాడు కమిటీ సభ్యులుపూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈకార్యక్రమాన్నిఉద్దేశించి . డి. వెంకటేష్ మాట్లాడుతూదామోదరం సంజీవయ్య నిరుపేదలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు.ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు బాగా స్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాసులు ఆరెస్పారాజు, మిద్దె,స్వాములు కళ్యాణ్ గురుమూర్తి,మునిపాటి అశోక్,మధు, మల్రెడ్డి,రవికుమార్,వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య 105 వ జయంతి వేడుకలు...!!

**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** కర్నూలు పట్టణం నంద్యాల చెక్ పోస్ట్ సెంటర్ లో దళిత ముఖ్యమంత్రి స్వర్గీయ దామోదరం.సంజీవయ్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు జాయింట్ కలెక్టర్ నూర్ అహమ్మద్,ఏపీ.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి.రాష్ట్ర డైరెక్టర్ జి.నాగముని మరియు సాంఘిక సంక్షేమ శాఖ డి.డి రాధిక పాల్గొన్నారు. అనంతరం స్వర్గీయ దామోదరం.సంజీవయ్య గురించి వక్తలు మాట్లాడుతూ..స్వర్గీయదామోదరం. సంజీవయ్య నిరుపేదలు,అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు.దామోదరం. సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి మరియు తొలి దళిత ముఖ్యమంత్రి ఫిబ్రవరి 14,1921న కర్నూలు జిల్లా కల్లూరు మండలంలో జన్మించడం జరిగింది.అలాగే మే 8,1972 వ తేది మరణించడం జరిగింది.అని 38 ఏళ్ల వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కింది.రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పనిచేసి,రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అయ్యాడు మరియు తొలి దళిత అధ్యక్షుడు.సంయుక్త మద్రాసు,ఆంధ్ర రాష్ట్రం ,ఆంధ్రప్రదేశ్‌లో అనేకసార్లు మంత్రిగా పనిచేశాడు.1960 జనవరి 11 నుంచి 1962 మార్చి 29 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నాడు.ముఖ్య కృషి పారిశ్రామి కాభివృద్ధికి తెలుగు భాష వాడుకనుపెంచాడు,భూసంస్కరణలు అమలుచేశాడు.గాజులదిన్నె,వరదరాజుల స్వామి ప్రాజెక్టులు ప్రారంభించి రాయలసీమకు సాగునీరు అందించారు.ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు,గనుల కార్పొరేషన్ ఏర్పాటు చేశాడు.ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు బాగా స్వాములు కావాలని సూచించారు.కర్నూలు జిల్లాకు స్వర్గీయదామోదరం.సంజీవయ్య పేరు పెట్టాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ నాయకులు,మహిళలు,ప్రజా సంఘాల నాయకులు,దళిత నాయకులు, విద్యార్థులు,అభిమానులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# అడికేష్ లింగమయ్య ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలి

- శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణం, అగ్నిగుండం ఏర్పాటు
- ఆలయ ప్రాంగణంలో 25 అడుగుల ఆది యోగి విగ్రహ ఆవిష్కరణ
- ఉపవాస దీక్షల విరమణ కోసం సోమవారం ఉదయం అన్నప్రసాద వితరణ
- ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మలనేని రాజశేఖర్



**కోటగిరి,దీక్ష ప్రభ:** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లింగాపూర్ గ్రామ శివారులోని అడికేష్ లింగమయ్య ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రెండు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయని భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మలనేని రాజశేఖర్ పేర్కొన్నారు.మహా శివరాత్రి రోజున ఉదయం 4 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు అభిషేకాలు, స్పర్శ దర్శనాలు చేసుకోవచ్చని తెలిపారు.అడికేష్ లింగమయ్య ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 25 అడుగుల అధియోగి విగ్రహన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్ ముమ్మలనేని రాజశేఖర్, పద్మ శ్రీ వీణ దంపతుల చేతుల మీదుగా శివరాత్రి రోజున ప్రారంభించడం జరుగుతుందన్నారు.శివరాత్రి రోజున సాయంత్రం 06:00 గంటలకు పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం కార్యక్రమం ఉంటుందని,రాత్రి 11:45 నిముషాలకు బాజా, భజనలతో భక్తుల అట పాటలతో అగ్నిగుండం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం శివరాత్రి సందర్భంగా జాగరణ లో భాగంగా భజనలు కీర్తనలు నిర్వహించబడతాయన్నారు.శివరాత్రి పండుగ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అడికేష్ లింగమయ్య స్వామి సేవలో భాగస్వాములు కావాలని పార్వతిపరమేశ్వరుల ఆశీస్సులు పొందాలని సూచించారు. సోమవారం ఉదయం 09:00 గంటలకు ఉపవాసం ఉన్న భక్తులు ఉపవాస దీక్షలు విరమించుకోవడానికి భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ ముమ్మలనేని రాజశేఖర్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేయబడుతుందని చెప్పారు. శివ రాత్రి పండుగ సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలు విజయవంతం చేయాలని కోరారు.





# పట్టుదలతోనే ఉన్నత శిఖరాలు

- ప్రముఖ పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణ
- విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి కోసం చదువుతో పాటు క్రీడా పోటీలు
- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్‌పర్సన్ రాణి రుద్రమ దేవి

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** విద్యార్థులు పట్టుదలతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణ పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం చిన్నకంజర్ల గ్రామంలోని విజ్ఞాన్ విద్యాలయంలో శనివారం వార్షిక క్రీడా దినోత్సవం (సమన్వయ 2026) వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ప్రముఖ పర్వతారోహకురాలు మాలావత్ పూర్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..విద్యార్థులు చదువులతో పాటు క్రీడలను కూడా సమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే పట్టుదల, శ్రమ, క్రీడాస్ఫూర్తి ఎంతో అవసరమని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్ పర్సన్ రాణి రుద్రమ దేవి మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధి కోసం తమ పాఠశాలలో చదువుతో పాటు అన్ని రకాల క్రీడా పోటీలు, సైన్స్ ప్రాజెక్టులు, సాంస్కృతిక, వ్యవస్థాపకత. కార్యక్రమాలు, సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం తమ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. విజ్ఞాన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మవల్లి మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో జట్టు భావన, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిథి బహుమతులు అందజేశారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో బీఆర్ఎస్ లో చేరిన జిన్నారం మున్సిపల్ స్వతంత్ర అభ్యర్థి

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** జిన్నారం మున్సిపల్ ఎన్నికల్లో 9వ వార్డు నుండి స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన శ్రీలత నాగరాజు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శనివారం సాయంత్రం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ కండువా కప్పి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ..నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిన్నారం మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు స్వతంత్ర అభ్యర్థి శ్రీలత నాగరాజు బీఆర్ఎస్ పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల లో బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్రా బిక్షపతి,రాజ్ కుమార్, మచ్చేందర్, సందీప్,తదితరులు పాల్గొన్నారు.



# మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన దేవదాయ కమిషనరు

**శ్రీశైలం,దీక్ష ప్రభ:** శ్రీశైలం క్షేత్రంలోని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శివ స్వాములకు శివ భక్తుల ఏర్పాట్లను శనివారం దేవదాయ కమిషనరు కె.రామచంద్రమోహన్ శనివారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణం, క్యూలైన్లు మొదలైనవాటిని పరిశీలించారు.ఈ సందర్భంగా పలు ఆదేశాలు జారీ చేశారు.ఈ పరిశీలనలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీ ఎస్.ఎస్. అజాద్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..క్యూలైన్లలో ఎటువంటి తొక్కిసలాట లేకుండా ఉండేందుకు గాను పోలీస్‌శాఖ సమన్వయంతో తగు ఏర్పాట్లు ఉండాలన్నారు.అలాగే తగినస్థాయిలో సెక్యూరిటీ సిబ్బందిని మరియు శివసేవకులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్యూకాంప్లెక్స్‌లోనూ నిరంతరం అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు మొదలైనవాటిని అందజేస్తుండాలన్నారు. క్యూలైన్లలో కూడా నిరంతరం మంచినీటిని అందజేస్తుండాలన్నారు. క్యూలైనులో ఏర్పాటు చేయబడిన వాటర్ పాయింట్లకు నిరంతరం నీటిసరఫరా ఉండాలన్నారు. క్యూలైన్లలో అవాంఛనీయ సంఘటనలు నిరోధించేందుకు మరియు అత్యవసర సమయాలలో వినియోగించుకునేందుకు క్యూలైన్లలో ఏర్పాటు చేయబడిన అత్యవసర గేట్లు (ఎమర్జెన్సీ ఎగ్జిట్ గేట్లు) సజావుగా పనిచేసేవిధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా క్యూకాంప్లెక్స్‌లోని శౌచాలయాల శుభ్రతపట్ల ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలన్నారు.అన్నీ శౌచాలయాలలో కూడా ఎటువంటి అంతరాయం లేకుండా నిరంతరం నీటిసరఫరా ఏర్పాటు ఉండాలన్నారు. శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్లలో కూడా మంచినీరు ఉండాలన్నారు.ఇంకా కమిషనరు మాట్లాడుతూ భక్తులు అధికసమయం క్యూలైన్లలో వేచివుండకుండా త్వరితంగా ప్రసాదాలను అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు.ముఖ్యంగా భక్తులు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్నప్రసాదవితరణ జరుగుతుండాలన్నారు. ఆయావంటకాలన్నీ రుచికరంగా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అన్నప్రసాదాలను స్వీకరించేందుకు వచ్చిన భక్తులు అధికసమయం వేచివుండకుండా వుండేందుకు తగు చర్యలు చేపట్టాలని కూడా ఆదేశించారు. ఇందుకుగాను అన్నదానమందిరంలోని ఆయా భోజనశాలలో తగు ముందస్తు ఏర్పాట్లు ఉండాలన్నారు.అన్నప్రసాద వితరణ సమయములో సంబంధిత అధికారులు ప్రతి హాలులో కూడా అన్నప్రసాద వితరణ సజావుగా జరిగేటట్లు పర్యవేక్షిస్తుండాలన్నారు. ప్రతి హాలును కూడా ప్రత్యేకంగా సిబ్బందిలో ఒకరు నిరంతరం పర్యవేక్షిస్తుండాలన్నారు. అన్నదాన మందిరములో శుచీ శుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ఎప్పటికప్పుడు అన్నదాన మందిరాన్ని శుభ్రపరుస్తుండాలని సిబ్బందిని ఆదేశించారు. క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్యంపై కూడా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు.చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించేవిధంగా పర్యవేక్షక సిబ్బంది తగు చర్యలు చేపట్టాలన్నారు. అన్ని శౌచాలయాలకు నిరంతరం నీటిసరఫరా ఉండేవిధంగా తగు ఏర్పాట్లు ఉండాలన్నారు. శౌచాలయాలు కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది అందరు కూడా భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. భక్తులు అడిగిన సమాచారాన్ని శివసేవకులు,సిబ్బంది ఓపికగా అందిస్తుండాలన్నారు.ఆలయ సమాచార వ్యవస్థద్వారా నిరంతరం భక్తులకు సమాచారాన్ని తెలియజేస్తుండాలన్నారు.





## గులాబీ గూటికి ఇద్దరు స్వతంత్ర కౌన్సిలర్లు

**పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే జీఎంఆర్**

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో స్వతంత్ర అభ్యర్థులుగా విజయ సాధించిన ఇద్దరు కౌన్సిలర్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు కౌన్సిలర్ ఎల్లకొండ రాహుల్ రెడ్డి, ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు కౌన్సిలర్ సార లావణ్యలకు గులాబీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, కార్యకర్తల కృషితో పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టబోతుందని ఎమ్మెల్యే జీఎంఆర్ తెలిపారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలు



**నందికొట్కూర్:దీక్ష ప్రభ:** నందికొట్కూరు మాల మహానాడు కార్యాలయంలో. పబ్బతి. శివప్రసాద్ ఆధ్వర్యంలో భారతదేశంలోనే మొట్టమొదటి తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్ మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా పెదపాడు గ్రామంలో సుంకులమ్మ మునయ్య దంపతులకు జన్మించిన ఆయన 38 ఏళ్ల అతిపిన్నవయసులో ఉమ్మడి ఏపీ సీఎం గా బాధ్యతలు చేపట్టి చరిత్ర సృష్టించారు కేంద్ర మంత్రిగా రెండుసార్లు ఏఐసిసి అధ్యక్షులు గా ఆయన సేవలు చిరస్మరణీయం ఏసీబీ వ్యవస్థ స్థాపన భూ పంపిణీ పెన్షన్ వంటి విప్లవత్మక సంస్కరణలు తెచ్చి అందరికీ పదవులు అనుభవించిన సొంత ఇల్లు కూడా లేని ఆయన నిడంబరత,నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం.అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మాల మహానాడు ఉపాధ్యక్షులు నల్లమల్ల పుల్లన్న నందికొట్కూరు మాలమహానాడు నాయకులు నాగేంద్ర,భూషణం, పాలమరి, నాగరాజు, శ్రీనివాసులు,పాత్రికేయులు, ఊసనాలం, జమ్మలయ్య, శ్రీనివాసులు కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## జునైద్ ఖాన్‌కి జోడిగా తమన్నా..



వయసులో తనకంటే చిన్నవాడితో రొమాన్స్ కి సిద్ధమయ్యింది మిల్కీ బ్యూటీ తమన్నా.. అదిరిపోయే స్టెప్పులు, తనదైన నటనతో అందరినీ అలరించే ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం కథల ఎంపిక విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే క్రేజీ ప్రాజెక్ట్ లతో దూసుకుపోతోంది. అలా ఇప్పుడు తన జాబితాలోకి మరో ప్రాజెక్ట్ చేరినట్లు సమాచారం.. త్వరలో రాగిణి 3 సినిమా వస్తున్న విషయం తెలిసిందే.. ఇప్పుడు ఈ సినిమాలో బాలీవుడ్ హీరో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ తమన్నా జంటగా నటిస్తున్నట్లు సమాచారం.. హారర్ థ్రిల్లర్ గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. శశాంక్ గోష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా కలయికతో ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ జోడి పరిచయం కాబోతోందని బాలీవుడ్లో చర్చ జరుగుతోంది. తమన్నా, జునైద్ ఖాన్ జంటగా నటించబోతున్నారు అని వార్తలు వస్తున్నప్పటి నుంచి వీరిద్దరి మధ్య ఏజ్ గ్యాప్ ఇప్పుడు చర్చకు దారితీసింది. తమన్నా వయసు 36 సంవత్సరాలు కాగా, జునైద్ ఖాన్ వయసు 32 సంవత్సరాలు. అయితే ఇద్దరి మధ్య నాలుగు సంవత్సరాల వయసు తేడా ఉండడం గమనార్హం. మరి ఇద్దరూ తెరపై ప్రేక్షకులను ఏ విధంగా ఆకట్టుకుంటారో చూడాలి.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై శ్రీశైల మల్లన్న ఆశీస్సుల కోసమే పాదయాత్ర

- శ్రీశైలంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు భేష్
- నంద్యాల జిల్లా ప్రజల బాగుకోసం అభయారణ్యంలో కాలినడకన
- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



**నందికొట్కూర్,దీక్ష ప్రభ:** కేంద్ర ప్రభుత్వంలోని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై,నా నంద్యాల జిల్లా ప్రజలపై శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్ల దీవెనలు, ఆశీస్సుల కోసం నల్లమల దట్టమైన పులుల ఆవాసమైన అభయారాణ్యంలో కాలినడకన 42 కిలోమీటర్ల దూరంలోని శ్రీశైలం వెళుతున్నానని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు,లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.శనివారం నంద్యాల జిల్లా శ్రీశైల నియోజకవర్గం,ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలోని శ్రీ మల్లేశ్వర స్వామికీ పూజలు చేసి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శ్రీశైలంకు నల్లమల అరణ్యం గుండా కాలినడక మొదలు పెట్టారు. ఈ సందర్భంగా నల్లమల అడవిలోని గోసాయికట్ట శ్రీ ఆంజనేయస్వామికీ విశేషపూజల అనంతరం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ తాను ప్రతి ఏటా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్బంగా నల్లమల అభయారణ్యంలో కాలినడక ద్వారా శ్రీశైలం చేరుకొని శ్రీ భ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లను దర్శనం చేసుకుంటున్నానని, ఈ ఏడాది కూడా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈ కాలినడక మొదలు పెట్టానన్నారు. శ్రీశైలంలో మొదటి రోజు శివ దీక్ష స్వాములపై పోలీసుల లాఠీ చార్జీ పై కొందరు విలేకరులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని వివరణ కోరగా, స్వాములపై లాఠీ ఛార్జ్ అనవద్దని, మొదటి రోజు అంచనాకు మించి భక్తులు శ్రీశైలం రావడం వల్ల కొంత ఇబ్బంది వస్తావమని, భక్తులను నియంత్రణ చేయడం జరిగిందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శ్రీశైలంలో సాఫీగా స్వామి, అమ్మ వార్ల దర్శనం కల్పిస్తున్నారని, మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ప్రభుత్వం బాగా ఏర్పాటు చేసిందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వివరించారు. వెంకటాపురం నుంచి నల్లమల అరణ్యంలో లక్షలాది మంది శివ భక్తులు శ్రీశైలంకు కాలినడకన వెళుతున్నారని, ఈ ఏడాది నల్లమల అభయారణ్యం లో పులుల లెక్కింపు జరుగుతున్నా భక్తులకు అటవీశాఖ ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసిందని, ప్రభుత్వశాఖలు, దాతలు కూడా అన్నదానం, ఉచిత వైద్యం, తాగునీటి వసతి నల్లమల అరణ్యంలో కాలినడక భక్తులకు కల్పించడం అభినందనీయం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతి తండాలో నిర్వహించాలి

- లంబాడి విద్యార్థి సేన సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు బానోత్ నరసింహ నాయక్



**సూర్యాపేట,దీక్ష ప్రభ:** నేడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రతి తండాలో ఘనంగా నిర్వహించాలని లంబాడి విద్యార్థి సేన సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు బానోత్ నరసింహ నాయక్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ..ఫిబ్రవరి 15న సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాము అన్నారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు 10 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.బంజారాలకు దిశా నిర్దేశం చేస్తూ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ఎన్నో అవాంతరాలు ఎదురైనా వాటిని ఎదిరించి బోధనలుచేస్తూ బంజారా సమాజాన్ని చైతన్యవంతం చేసిన గొప్ప సంఘ సంస్కర్తగా,పోరాట యోధుడు శ్రీ సేవాలాల్ మహరాజ్..బంజారాలు సంచార జీవనం వదిలి తండాలను నిర్మించుకొని స్థిర నివాసాలుగా మార్చుకోవాలన్నారు.బంజారాలకున్న అపారమైన పశుసంపదతో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.మూఢనమ్మకాలు,మద్యపానం వంటి చెడు అలవాట్ల నుండి దూరంగా ఉండాలన్నారు.జంతుబలి ఇవ్వకూడదని సేవాలాల్ జీవించినంత కాలం హితబోధ చేస్తూనే వచ్చారు.ఇతర మతాల వైపు ఆకర్షితులు కాకుండా బంజారాలకున్న ప్రత్యేక సంస్కృతి, ఆచారాలు, భాష, వేషాధారణలను కాపాడుకుంటూ ఐక్యంగా ఉనికిని చాటుకోవాలన్నారు.అజ్ఞానంలో ఉన్న నీతోటి బంజారాల విజ్ఞానం నీవు అడవిలో పరమశించిన మానవత్వ పువ్వువు నీవు కన్నీళ్ళు తుడిచేందుకు బంజారాల తోబుట్టువు నీవు జంతుబలి వద్దుంటూ ఎదిరించిన యోధుడవు నీవు నవసమాజ నిర్మాణం కోసం తండాలను స్థాపించిన ధీశాలివి నీవు బంజారాల ఉనికిని సమాజానికి చాటిచెప్పిన సామాజిక విప్లవ కారుడిని నీవు.. అటువంటి గొప్ప బోధనలను సేవాలాల్ జయంతి సందర్భంగా ప్రతి తండాలో బంజారాలు చర్చించుకునే విధంగా చేయడమే కాకుండా సేవాలాల్ స్ఫూర్తితో గిరిజనులకు ఇచ్చిన రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రపంచీకరణ ప్రభావం వలన గిరిజనుల సంస్కృతి ,భాష, ఆచారాలతో పాటు ప్రత్యేక ఉనికి తీవ్ర ప్రమాదంలో పడింది. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం గిరిజనుల సంస్కృతి ఆచారాలపై దాడులు చేస్తూ ఆధిపత్య మత సంస్కృతిని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నది. ఇటువంటి తరుణంలో గిరిజనులకు ఏ మత సంస్కృతితో సంబంధం లేకుండా 2027లో కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనాభా లెక్కల మతం అనే కాలంలో బంజారా గిరిజనులు ప్రకృతి ఆరాధికులుగా గుర్తింపు ఇచ్చేందుకు ప్రత్యేక కాలం పెట్టాలని డిమాండ్ చేయాల్సిన అవసరం ఉన్నది.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** మండలంలోని కౌసల్యదేవిపల్లి గ్రామానికి చెందిన కోల రాములు మృతి చెందగా శనివారం కాంగ్రెస్ నాయకుడు, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు అన్నంగి నరేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుమారుడు కోల కృష్ణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబానికి చెందిన రాములు అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ధైర్యంగా ఉండాలన్నారు. పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డి విద్యాకర్ రెడ్డి,గడ్డి మహేష్ తదితరులు ఉన్నారు.

## నేడే శివ కళ్యాణం

**శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు**



**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సింహులపేట, పెద్దనాగారం స్టేజ్, వంతడుపుల శివాలయలను అందంగా ముస్తాబు చేశారు. ఆలయాలు విద్యుత్ద్దీపాలతో దగదగ మెరిసిపోతూ శివరాత్రికి ముస్తాబయ్యాయి. ఆదివారం తెల్లవారు జామునుంచే ఆలయాలకు భక్తులు పొటెత్తనున్నారు. శివునికి సామూహిక అభిషేకాలు, అర్చనలు, నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో 20వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహకులు అన్నావజ్జుల సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉదయం నుంచే శివాలయాలన్ని 'శంభోశంకర హరహరమహేదేవ, ఓం నమశివాయం' అంటూ భక్తుల నినాదాలతో మార్మోగనున్నాయి. ఆలయ అర్చకులు దేవేందర్ శర్మ, మహేష్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనున్నారు.


## 'పుల్వామా' అమర వీరులకు నివాళి

**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** జమ్ము కాశ్మీర్‌లోని పుల్వామా ఉగ్రదాడిలో అశువులు బాసిన వీర సైనికులకు శనివారం సిఆర్పిఎఫ్, బిఎస్ఎఫ్ జవాన్ల ఘనంగా నివాళి అర్పించారు. 2019, ఫిబ్రవరి 14న దేశ రక్షణలో భాగంగా విధులు నిర్వహించేందుకు 70 వాహనాల్లో కశ్మీర్‌కు వెళ్తున్న సీఆర్పీ జవాన్లు 2,500 మంది ఉగ్రవాద సంస్థ దాడిలో అమరులు అయ్యారు. మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద పుల్వామా అమరుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ జవాన్లు కొండ్రెడ్డి దేవేందర్ రెడ్డి, ఊదరి యాకయ్య, రిటైర్డ్ బిఎస్ఎఫ్ జవాన్ శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ పెదమాముల యాకయ్య,ఉప సర్పంచ్ కాస యాకన్న, ఉద్యమకారులు కాజామియా, సమ్మయ్య, సాయికృష్ణ, సతీష్,ఎర్ర దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.




# కరేగాం మహాదేవ్ గుట్ట శివాలయంలో శివనామ సప్తాహ

- అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసిన యూత్ కాంగ్రెస్ నాయకుడు గంధపు రాజు
- ఎస్ఐ సునీల్, తహసిల్దార్ గంగాధర్ లను సన్మానించిన ఆలయ కమిటీ



**పోతంగల్,దీక్ష ప్రభ:** పోతంగల్ మండలం కారేగాం గ్రామ శివారులోని మహాదేవ్ గుట్ట శివాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖండ శివనామ సప్తాహ ఆరవ రోజు ఘనంగా కొనసాగింది. శివనామ సప్తహాలో ఆరవ రోజు అయిన శనివారం మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు గంధపురాజు ఆధ్వర్యంలో సప్తాహ భజన మండలి సభ్యులకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా ఏర్పాటుచేసిన అఖండ శివనామ సప్తాహ శివరాత్రి పర్వదినం సందర్భంగా నేడు ముగియనుంది. ఆలయంలో నిర్వహిస్తున్న సప్తహాలో పోతంగల్ తహసిల్దార్ గంగాధర్, కోటగిరి ఎస్ఐ సునీల్ పాల్గొని శివుడిని దర్శించుకున్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నాయకుడు గంధపురాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా తహసిల్దార్ గంగాధర్, ఎస్ఐ సునీల్ లను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా కారేగావ్ మహదేవ్ గుట్ట ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు దొడ్డిమీది రాంబాబు,మాజీ ఎంపీపీ గంధపు పవన్, హంగర్ గా సర్పంచ్ ఉదయ్ భాస్కర్, ఈర్వంత్ రావు పటేల్, ఆలయ పూజారి దీపక్ మహారాజ్,గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar**. RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com